# పోలింగ్‌కు..ఏర్పాట్లు

**దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేయడానికి అందుబాటులో వీల్‌చైర్లు**

- 2,50,733 మంది ఓటర్లు
- 235 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


మారేడ్‌పల్లిలోని కస్తుర్బా కళాశాలలో నిర్వహించనున్న ఓటింగ్‌కు సిద్ధమైన పోలింగ్ కేంద్రం

కంటోన్మెంట్, నవంబర్ 29: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం జరుగనున్న ఎన్నికల కోసం అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో భాగంగా కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల నిర్వహణ కోసం 235 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు సజావుగా ఎన్నికల ఓటింగ్ ప్రక్రియను నిర్వహించడానికి పటిష్ట ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రానికి అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది చేరుకొని ఓటింగ్ అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం 235 ఈవీఎంలు, 50కి పైగా రిజర్వు ఈవీఎంలు అందుబాటులో ఉంచారు. 1200 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనుండగా 500 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చూస్తున్నారు. స్థానిక పోలీసులతోపాటు అదనపు బలగాలతో ఎన్నికల నిర్వాహకులు ఎలాంటి ఆటంకం కలుగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలు, చుట్టుపక్కల నిఘా ఏర్పాటు చేయడంతోపాటు స్థానిక పోలీసులు, ప్రత్యేక బలగాలతో భద్రతను కట్టుదిట్టం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో మొత్తం 2,50,733 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,25,964, మహిళలు 1,24,761, ఇతరులు 8 మంది ఉన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు ఎన్నికల సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. 20 రూట్లలో ఒక్కో సెక్టోరియల్ ఆఫీసర్స్‌తో పాటు మొత్తం 1200 మంది ఎన్నికల అధికారులు విధులు నిర్వర్తిస్తారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించగా పలువురు ఇప్పటికే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేయడానికి స్ట్రెచ్చర్, మూడు చక్రాల సైకిళ్లు (వీల్ చైర్లు) అందుబాటులో ఉంచారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ఓటింగ్ జరుగుతుందని, పకడ్బందీగా ఓటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బంది నియామకం, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు

## క్రిస్టియన్ల మద్దతు బీఆర్‌ఎస్‌కే

మారేడ్‌పల్లి/సికింద్రాబాద్, నవంబర్ 29: క్రిస్టియన్ మైనార్టీల రక్షణకు, సమానత్వ సుస్థిర పాలనకు బీఆర్‌ఎస్ పార్టీకి దళితులు, దళిత క్రైస్తవులు మద్దతివ్వాలని సీనియర్ క్రైస్తవ నాయకుడు, బీఆర్‌ఎస్ పార్టీ క్రిస్టియన్ సెల్ సభ్యుడు భాస కృపానందం పిలుపునిచ్చారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చి దళిత క్రైస్తవుల క్రిస్టియన్ మైనార్టీల హక్కులను హరిస్తే... కాంగ్రెస్ కేవలం వారిని ఓటు బ్యాంకుగా వాడుకొని సంక్షేమాన్ని విస్మరించిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం క్రైస్తవులు, మైనార్టీల సంక్షేమానికి పాటుపడ్డారని పేర్కొన్నారు. కంటోన్మెంట్, సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో ఉన్న క్రైస్తవ డినామినేషన్లు, పాస్టర్లు, బిషప్‌లు, విశ్వాసులందరూ పని చేసే ప్రభుత్వానికి అండగా నిలువాలని కృపానందం పిలుపునిచ్చారు.

**సికింద్రాబాద్ నియోజకవర్గంలో..** బీఆర్‌ఎస్ పార్టీకి దళిత సంఘర్షణ సమితి నాయుకుడు మద్దతు తెలిపారు. దళితులు ఆత్మగౌరవంగా బతకడానికి దళిత బంధు, బీసీల కోసం బీసీ బంధు, మైనార్టీ బంధును అమలు చేశారు. అదేవిధంగా ఇండ్లు లేనివారి కోసం డబుల్ బెడ్రూమ్ , 24 గంటల కరెంటు, కల్యాణ లక్ష్మి లాంటి పథకాలు తీసుకొచ్చిన ఏకైక సీఎం కేసీఆర్‌అని అన్నారు. 75 సంవత్సరాల కాలంలో ఏ ప్రభుత్వం కూడా సీఎం కేసీఆర్‌లాగా ఆలోచన చేయలేదన్నారు.



దీక్షా దివస్ సందర్భంగా కార్ఖానాలోని ఆర్‌కేఎస్ మదర్ థెరిస్సా ఫౌండేషన్ (వృద్ధాశ్రమం) లో వద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్

## దీక్షా దివస్‌తోనే.. తెలంగాణ కల సాకారం

**కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్**

మారేడ్‌పల్లి, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటం చేసి తెలంగాణ నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో కేసీఆర్ తెగువ యావత్ మానవ జాతికే స్ఫూర్తిదాయకమని బుధవారం బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష 'నవంబర్ 29' దీక్షా దివస్ సందర్భంగా కార్ఖానాలోని ఆర్‌కేఎస్ మదర్ థెరిస్సా ఫౌండేషన్ (వృద్ధాశ్రమం)లో కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ మాట్లాడుతూ....కేసీఆర్ ప్రాణాలను పణంగా పెట్టి చేసిన నిరాహార దీక్ష ఫలితంగా తెలంగాణ ప్రజల కల సాకారమైందన్నారు. తెలంగాణ వచ్చుడో...కేసీఆర్ సచ్చుడో అని చేసిన పోరాటం, త్యాగ ఫలితంగా ప్రత్యేక రాష్ట్రంతో ప్రజలకు ఆత్మగౌరవం దక్కిందన్నారు. అటువంటి కారుణజన్ముడు కలకాలం ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, మూడోసారి కూడా కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యు డు రామకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు సత్యనారాయణ గౌడ్, నిత్య, నాగేష్ యాదవ్, ప్రభు, నవీన్, మోసిన్, బాబాయ్యయాదవ్, బొట్టు శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

## పల్లెబాటన..ఓటర్లు

- కిటకిటలాడుతున్న బస్సులు, ప్రైవేట్ వాహనాలు

నేడు జరుగబోయే అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో పట్నంలో నివసించే పల్లె ప్రజలు పల్లెబాట పట్టారు. తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కుటుంబ సభ్యులతో కలిసి ఊర్లకు బయలు దేరారు. బుధవారం జూబ్లీ బస్‌స్టేషన్ జనాలతో కిక్కిరిసిపోయింది.– మారేడ్‌పల్లి, నవంబర్ 29





